శెట్టిపల్లి లే అవుట్ పనులు పూర్తి

లబ్ధిదారులకు ఈనెల 15న లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు: జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఈ నెల 15న లాటరీ విధానంలో ముఖ్యమంత్రి ఎంపిక చేయనున్నారు. గురువారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కానారేన్స్ సమావేశంలో తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దివాకర్ రెడ్డి, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, తుడా అధికారులు, స్థానిక గ్రామ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్లాట్ల కేటాయింపులు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, భూముల సమస్య పరిష్కారం తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడంతో, లే అవుట్ పనులు పూర్తయయని, అర్హులైన వ్యవసాయదారులు, ప్లాటుదారులకు కనీసం రెండు సెంట్లతో ప్లాట్లు కేటాయిస్తాం. రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపుగా ఉంటాయని తెలిపారు. అలాగే, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు హద్దులు, వివరాలతో ముద్రించి అందజేయడం కోసం తుడా, రెవిన్యూ శాఖ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్లాట్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఒకే రోజున నిర్వహించబడనుంది. తుడా ద్వారా 65 ఎకరాలు కేటాయించి శెట్టిపల్లి మోడల్ సిటీని ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, త్రాగునీరు, విద్యుత్, పార్కులు, దేవాలయాలు, శ్మశానవాటికలతో పాటు వాణిజ్య భవనాల ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ఈ సమావేశంలో తిరుపతి రెవెన్యూ అధికారి రాంమోహన్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవికుమారి, భూ సేకరణ అధికారి సుజన, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, సర్వేయర్లు, ఏకం ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

రికార్డు స్థాయిలో లడ్డూల విక్రయం

- గత ఏడాదితో పోల్చితే 10 శాతం అధికం
- డిసెంబర్ 27న అత్యధికంగా 5.13 లక్షల లడ్డూల విక్రయం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: 2025 సంవత్సరంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలు రికార్డుస్థాయిలో విక్రయించబడ్డాయి. 2024వ సంవత్సరంతో పోల్చితే 10 శాతం అధికంగా లడ్డూలను భక్తులకు విక్రయించడం జరిగింది. గత ఏడాది 12.15 కోట్ల లడ్డూలను విక్రయించగా ఈ ఏడాది 13.52 కోట్ల లడ్డూలను టీటీడీ భక్తులకు విక్రయించింది. అంటే గత ఏడాదితో పోల్చితే 1.37 కోట్ల లడ్డూలను ఈ ఏడాది అదనంగా భక్తులకు విక్రయించడం జరిగింది. గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా 2025 డిసెంబర్ 27వ తేదిన అత్యధికంగా 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక విక్రయం. టీటీడీ గత సంవత్సరం గా ప్రతిరోజూ 4 లక్షల వరకూ లడ్డూలను తయారు చేస్తోంది. ముఖ్యమైన రోజుల్లో 8 లక్షల నుండి 10 లక్షల లడ్డూల వరకు (బఫర్) భక్తలకు అందుబాటులో ఉంచుతోంది. 700 మంది శ్రీవైష్ణవ బ్రహ్మణులు శ్రీవారి పోటులో రెండు షిఫ్టుల్లో 24 గంటలు శ్రమిస్తూ నియమ, నిష్టలతో స్వామివారి లడ్డూ ప్రసాదాలను తయారు చేస్తారు. ఇటీవల కాలంలో లడ్డూల నాణ్యత, రుచి పెరగడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రోడ్డు భద్రతా పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: జనవరి 2026లో జరగనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నరసింహులు, జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ లతో కలిసి కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ గురువారం రోడ్డు భద్రతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., ప్రజలకు హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ తప్పక వాడటం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం వంటి రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా పాటించమని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రవాణా శాఖలు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటివల్ల ప్రజల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు పెంపొందుతాయని, సమాజంలో రోడ్డు భద్రతా సంస్కృతి బలపడుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలను విధిగా పాటించాలి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు గురువారం స్థానిక కలెక్టరేట్ లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారిపై జాగ్రత్తగా వాహనాన్ని నడపడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలలో 90 శాతం నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 01 నుంచి నుండి 31 వరకు జరుగుతాయని, ఈ నెల రోజుల పాటు రహదారి భద్రతా నియమాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన చోదకులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో నిరంజన్ రెడ్డి ఇతర రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అపోలో యూనివర్సిటీలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రతి రోజూ నూతన ఆరంభమే: వీసీ డా. హెచ్.వినోద్ భట్

విశాలాంధ్ర-చిత్తూరు: అపోలో యూనివర్సిటీ, చిత్తూరులోని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు హాజరై కేక్ కట్ చేసి అధ్యాపకులు, సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ, నూతన సంవత్సరం అనేది కేవలం క్యాలెండర్ మారడమే కాకుండా, ప్రతి రోజు ఒక నూతన ఆరంభంగా భావించి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలంటే మన ఆలోచనలు, పనితీరు కీలకమని పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే అపోలో యూనివర్సిటీ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించిందని, ముఖ్యంగా బోధన, పరిశోధన, వినూత్న ఆలోచనల రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు అందరూ కలిసి ఒక కుటుంబంలా పనిచేస్తే యూనివర్సిటీ వాతావరణం మరింత సృజనాత్మకంగా మారుతుందని పేర్కొంటూ, వర్క్‌ప్లేస్‌ను ఒక మాత ృభూమిలా భావించి అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. రిజిస్ట్రార్ ప్రొ. ఎం.పోతరాజు మాట్లాడుతూ, 2025 సంవత్సరం అపోలో యూనివర్సిటీకి గణనీయమైన ప్రగతిని తీసుకొచ్చిందని తెలిపారు. గత సంవత్సరం జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమం అత్యంత విజయవంతంగా పూర్తవడం యూనివర్సిటీ అకడమిక్ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. అదేవిధంగా, యూనివర్సిటీకి ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించడమే కాకుండా, న్యాక్ గుర్తింపు దిశగా చర్యలు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. పరిశోధన (రిసెర్చ్) యూనివర్సిటీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, అధ్యాపకులు, విద్యార్థులు తమ వ్యక్తిగత అభివృద్ధితో పాటు యూనివర్సిటీ వృద్ధికి సహకరించాలని కోరారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. సేతురామ సుబ్బయ్య, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొ. కె.భాస్కర్‌రెడ్డి, విభాగాధిపతులు డా. సుచరిత, డా. సత్యనారాయణ, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌టియు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి: ఎస్‌టియు నూతన సంవత్సరం 2026 డైరీ మరియు క్యాలెండరును డిఈవో కార్యాలయంలో తిరుపతి జిల్లా విద్యశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపిసి గౌరీ శంకర్, ఐటీ సెల్ అధికారి కందిపాటి ధనంజయులు నాయుడు, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్ యాదవ్, మునికృష్ణ నాయుడు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కమిషనర్ మౌర్యాను, మేయర్ డాక్టర్ శిరీషను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి కమిషనర్ మౌర్య, పాలకవర్గం ఎంతో కృషి చేస్తూ ఉందని కొనియాడారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి సేతు మాధవ్‌తో పాటు కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు: ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న విశాలాంధ్ర జాతీయ దినపత్రిక క్యాలెండర్ ను గురువారం మాజీ మంత్రి, పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ప్రతి అక్షరాక్షరం అభ్యుదయం నినాదంతో విశాలాంధ్ర దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుక వినిపిస్తోందని, విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజక కన్వీనర్ చెన్నకేశవులు, ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ్, విశాలాంధ్ర పలమనేరు విలేకరి సుబ్రమణ్యం, బైరెడ్డి పల్లి విలేకరి గౌస్ బాషా, గంగవరం విలేకరి భాస్కర్ రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాలమండలం, శ్రీ స్వామి వారి దేవస్థాన నందు ఆంగ్ల నూతన సంవత్సరం 2026 జనవర1వ తేది గురువారం ఉదయం స్వామివారి దర్శనార్థమై ఆలయం లో పోటెత్తిన భక్తుల రద్దీ, క్యూ లైన్ లో ఆలయ మాడ వీధుల్లో కిక్కరించిన భక్తులు, ఉచిత దర్శనానికి బారులు తీరిన భక్తులు, క్యూలైన్లో బాదంపాలు, బిస్కెట్లను పంపిణీ చేసిన ఆలయ అధికారులు, భక్తులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు లేకుండా భక్తులక దర్శన సౌభాగ్యంచేసిన ఆలయ అధికారులు.

నేటి నుంచి పాస్ పుస్తకాలు పంపిణీ: ఆర్డీఓ

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలో రీ సర్వే చేసిన గ్రామాల్లో రైతులు సంబంధించి పాస్ పుస్తకాలను శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో జిల్లా వ్యాప్తంగా 319 గ్రామాల్లో రైతులకు సంబంధించి భూములను రీ సర్వే చేయడం జరిగిందని తెలిపారు. అయితే గతంలో ఈ గ్రామాల్లో పాస్ పుస్తకాల లో భూమి వివరాలు సక్రమంగా లేకపోవడం, పాస్ పుస్తకాల పైన రాజముద్ర లేకపోవడంతో వీటిని రైతులకు ఇవ్వకుండా నిలిపియడం జరిగిందని వివరించారు. తదుపరి ఆ పాస్ పుస్తకాలను ప్రభుత్వం దద్దుపరిచినట్లు చెప్పారు. తాజాగా రాజముద్ర ముద్రించిన పాస్ పుస్తకాలను రైతులకు అందించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాకు 319 గ్రామాలకు గాను సుమారు 70 వేల వరకు పాస్ పుస్తకాలు జిల్లాకు అందాయని, అయితే ఇందులోనూ సుమారు 15 వేల పాస్ పుస్తకాల్లో కొన్ని తప్పిదాలు ఉన్నట్లు గుర్తించమన్నారు. వీటిని మినహాయించి ఈ గ్రామాల్లో ఎమ్మార్వోలు వీఆర్వోల సమక్షంలో సక్రమంగా ఉన్న పాస్ పుస్తకాలను సంబంధిత రైతులకు ఈనెల 9 తేదీ వరకు పంపిణీ చేయడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు.

కొత్త ఏడాదిలో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలి ఎంపీపీ

విశాలాంధ్ర-చిట్టమూరు: కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు అంతా శుభమే జరగాలని,చిట్టమూరు మండల పరిషత్ అధ్యక్షురాలు సన్నారెడ్డి విజయలక్ష్మి కోరారు. నూతన సంవత్సర సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయ అధికారులు పలువురు ఎంపీపీ విజయలక్ష్మమ్మను వారి నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నో అనుభూతులను మిగిల్చిన 2025కు వీడ్కోలు పలికి కొత్త ఆశలు, కలలు, విజయాలతో 2026 నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వైయస్సార్సీపి చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి జీవితాల్లో శాంతి, సంతోషం ఉండాలని బలమైన సుసంపన్నమైన భవిష్యత్తు నిర్మాణానికి కొత్త శక్తిని నింపాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరం సానుకూల మార్పులకు కొత్త సంకల్పాలకు, సమిష్టిగా సంకల్ప బలంతో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా, తిరుగులేని విజయాల సాధనకు ఈ ఏడాది అందరికీ అదుతేమైన సంవత్సరం కావాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వెదురుకుప్పం: విశాలాంధ్ర జాతీయ దినపత్రిక క్యాలెండర్‌ను జీడీ నెల్లూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్ తిరుపతిలో గురువారం ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రిక 73 సంవత్సరాలు నిరంతరాయంగా ప్రజల మన్ననలు పొందుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పత్రికా యాజమాన్యానికి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర సీనియర్ జర్నలిస్టు, జిడి నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోవిందు, వెదురుకుప్పం మండలం ఇనాం కొత్తూరు పంచాయతీ సర్పంచ్ కటారి మమత మోహన్ రెడ్డి, బూత్ కన్వీనర్లు సువ్వాల మునిరాజారెడ్డి, బోడిరెడ్డి మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు పుల్లూరు సుధాకర్ రెడ్డి, తెలుగు యువత అరగొండ మురళీ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ భూములను పరిశీలించిన కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-శాంతిపురం: శాంతిపురం మండలం దండి కుప్పం సమీపంలో నిర్మిస్తున్నటువంటి విమానాశ్రయం భూముల వద్దకు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. కలెక్టర్ తో పాటు కడ పిడి వికాస్ మరమ్మత్, ఆర్డిఓ శ్రీనివాసరాజు సంబంధిత విమానాశ్రయ భూమిని పరిశీలించడం జరిగినది. విమానాశ్రయ నిర్మాణం కొరకు భూములు ఇచ్చేందుకు కొంతమంది రైతులు విముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసినదే, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దండి కుప్పంలో పర్యటించి సంబంధిత రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి విన్నపాన్ని రాతపూర్వకంగా నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది.

టాస్క్ ఫోర్స్‌లో నూతన సంవత్సర వేడుకలు

టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడుకి శుభాకాంక్షలు తెలిపిన టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

విశాలాంధ్ర-తిరుపతి: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ కి ఏఎస్పీ జె.కులశేఖర్, డీఎస్పీలు వీ.శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్, ఏసీఎఫ్ శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలతో ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత ఎస్పీ కేక్ కట్ చేసి సిబ్బందికి పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ఎర్రచందనం పరిరక్షణలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్మగ్లర్లను అడవిలోకి ప్రవేశించకుండా నిరోధానికి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ఆ తరువాత ఎస్పీ అధికారులతో కలసి టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడుని ఆయన కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నైనేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోనే డియంపురం పంచాయతీ దేరా కండిగ గ్రామంలో వెలసి ఉన్న నైనేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఆనందుడు, బొబ్బిలి రెడ్డి సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రానికి చెందిన మొగసాల కుటుంబీకులు మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉన్న సమయంలో మంత్రిగాబాధ్యతలు నిర్వహించిన రామచంద్రారెడ్డి ప్రజల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజాభిమానం చూరగొన్నారని ఈ సందర్భంగా వారు కొనియాడారు.బుధవారం రాత్రి ఆయన నివాసానికి చేరుకున్న మొగసాల కుటుంబీకులు, వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ చైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, జిల్లా ఎంపీపీ అధ్యక్షులు ఎం. రెడ్డప్పలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొంటూ, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

గురు దక్షిణామూర్తికి విశేష పూజలు



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం, గురువారం కావడంతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ప్రాంగణంలో వెలసిన గురుదక్షిణామూర్తిస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో స్వామి వారికి శాస్త్రోక్తంగా ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, విశేష హారతులు ఇచ్చారు. దక్షిణామూర్తిని దర్శించుకునేందుకు భక్తులు, పురప్రజలు భారీగా తరలివచ్చారు. స్వామి వారి అనుగ్రహం నియోజకవర్గ ప్రజలపై ఉండాలని అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం: డాక్టర్ బత్తైయ్య నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నూతన ఏడాది సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సముద్రాల బత్తైయ్య నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని... ప్రజల సంక్షేమం కోసం తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. నూతన సంవత్సరంతో పాటు రాబోయే సంక్రాంతి పండుగ కూడా ప్రతి ఇంటా ఆరోగ్యం, ఐక్యత, ఆనందాన్ని నింపాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర-శాంతిపురం: శాంతిపురం మండలం వెంకటాపురం కి చెందిన చిన్న వెంకటేశు కుమారుడు సోమశేఖర్ (21)రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగినది.ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామమైన వెంకటాపురం నుండి కుప్పం రైల్వే స్టేషన్ కు వెళుతుండగా మార్గం మధ్యంలో గుడిపల్లి మండలం గుడి కొత్తూరు గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం గుద్దుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగినది.108 సహకారంతో ఆయనను పిఇఎస్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందడం జరిగిందని బంధువులు తెలియజేశారు. గుడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని పల్లెలపై 'బెల్టు' పడగ

మామూళ్ల మత్తులో నాగలాపురం ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలంలోని పలు పచ్చటి పల్లెలపై బెల్టు పడగ విప్పుతోంది. దాదాపు ప్రతి గ్రామంలోనూ విచ్చలవిడిగా అనధికార బెల్ట్ షాపులు కొనసాగుతోంది. గత వైసిపి ప్రభుత్వం మద్యం షాపులను అప్పటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని బేవరేజ్ సంస్థ నడిపింది. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని రద్దుచేసి మద్యం షాపులను రద్దుచేసి డ్రా లాటరీ పద్ధతిలో మద్యం షాపుల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించింది. ఈ నేపథ్యంలో ఎక్కడా కూడా బెల్ట్ షాపులు కొనసాగితే బెల్టు తీస్తామంటూ స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే బెల్ట్ షాపులు యదేఛగా కొనసాగుతున్న సంబంధిత ఎక్సైజ్ అధికారులు బెల్ట్ తీయడంలో వెనుకంజ వేయడంపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. మండలంలోని ఇరుగుళం గ్రామంలో ఆరేడు బెల్ట్ షాపులు కొనసాగుతోంది. అక్కడ హైస్కూల్కి పక్కన రెండు మూడు బెల్ట్ షాపులు నడుస్తుండగా సచివాలయానికి సమీపంలోనూ, గుడికి సమీపంలో, దళితవాడలోను బెల్ట్ షాపుల జోరు కొనసాగుతోంది. పైగా ఇక్కడ పొద్దు పోయే సమయంలో బెల్ట్ షాపుల నుంచి మద్యం సీసాలను కొనుగోలు చేసి బహిరంగ ప్రదేశాల్లో తాగడం వల్ల తరచూ గొడవలు కూడా జరుగుతున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. దీంతోపాటు మల్లవారి పాలెం తూర్పు పంచాయతీ రామచంద్రా పురం లో కొనసాగుతున్న బెల్ట్ షాపుల్లో ఏకంగా తమిళనాడు మద్యం సీసాలు విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తమిళనాడుకు సరిహద్దు ప్రాంతంలో రామచంద్రపురం ఉండటం వల్ల అక్కడ బెల్ట్ షాప్ నిర్వాహకులు తమిళనాడు మద్యం సీసాలను తెప్పించుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే అప్పయ్య పాలెం, కొల్లడం, గొల్లవారిపాలెం, రాజగోపాలపురం, పివిపురం ఎస్టి కాలనీ,కన్నవరం, మదనంబేడు, ఆంబాకం, సిరణంబుదురు, మధనంజేరి, దాసుకుప్పం వంటి ప్రాంతాల్లో బెల్ట్ షాపు విచ్చలవిడిగా కొనసాగుతున్నట్టు స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు.పైగా ప్రభుత్వం నుంచి డ్రా పద్ధతిలో లైసెన్సు తీసుకొని మద్యం షాపులు నడుపుతున్న వారే ఆయా బెల్ట్ షాపులకు మద్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.సాధారణంగా లైసెన్సు మద్యం షాపుల్లో క్వార్టర్ మద్యం సీసా వంద రూపాయలకు విక్రయిస్తుంటే బెల్ట్ షాపు నిర్వాహకులకు 120 రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నారు.వీటిని బెల్ట్ షాపు నిర్వాహకులు 150 రూపాయలు చొప్పున మద్యం ప్రియులకు ఎమ్మార్పీ ధరల కన్నా 50 రూపాయలు అధికంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. మండలంలో మూడు పెగ్గులు ఆరు గ్లాసులు చందంగా మండలంలో బెల్ట్ షాపు జోరు అందుకుంది. బెల్టు షాపుల ముసుగులో పల్లెల్లో ఏరులై పారుతునడంతో ప్రశాంత వాతావరణంలో జీవనము కొనసాగిస్తున్న పలు కుటుంబాలపై ఈ బెల్టు పడగా విప్పుతోంది. తద్వారా పల్లెలో కూడా మద్యం అమ్మకాలు జోరుగా జరగడంతో ముఖ్యంగా యువత బానిసలు అవుతున్నట్టు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు శ్రీసిటీ ప్రాంతంలో నడుస్తున్న పలు కర్మాగారాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులు కొందరు మద్యం సేవించడం వల్ల తరచూ ఘర్షణ వాతావరణం పల్లెల్లో నెలకొనే అవకాశాలు లేకపోలేదు. అయితే పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కొనసాగుతున్న సంబంధిత నాగలాపురం ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు ఉన్నాయి. అయితే మద్యం షాపుల నుంచి ఎక్సైజ్ అధికారులకు నెలసరి మామూళ్లు అందుతుండడం వల్లే బెల్ట్ షాపుల నిర్మూలనపై పట్టించుకోవడం లేదన్న ప్రచారం జరుగుతోంది. మరోపక్క శ్రీసిటీ పోలీసులు సైతం బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రతి ఊర్లోను రెండు మూడు బెల్ట్ షాపులు నడుస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ కూడా బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హెచ్చరిక తూట్లు పొడిచే విధంగా సంబంధిత ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది.పైగా బెల్ట్ షాపుల ద్వారా ఎక్కడికక్కడ మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఇప్పటికైనా దీనిపై జిల్లా అధికార స్పందించి పచ్చటి పల్లెలపై పడగ విప్పుతున్న బెల్టు షాపులను బెల్టు తీయాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి పీవీ జ్యోతిర్మయి గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, ఎఈఓ దేవరాజులు, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ సురేష్, ప్రోటోకాల్ జార్జి కోటేశ్వరరావు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సుప్రభాత సేవలో పాల్గొన్న వారికి వేదపండితులు ఆశీర్వదించగా, ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీలు) 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను 32 నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి జిల్లా స్థాయి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటన తెలిపారు. ఈ నియామకాలు తాత్కాలికంగా, అవుట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా టైప్ 3 కేజీబీవీల్లో 9, టైప్ 4 కేజీబీవీల్లో 23 పోస్టులు ఖాళీగా ఉండగా, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, వార్డెన్, పార్ట్‌టైం టీచర్, చౌకిదార్, కుక్ విభాగానికి సంబంధించిన పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులు కేవలం మహిళా అభ్యర్థులకు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. అర్హత గల మహిళా అభ్యర్థులు జనవరి 3 నుంచి 11 వరకు అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ), సమగ్ర శిక్ష కార్యాలయం, తిరుపతి జిల్లా వద్ద ఆఫ్లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక వాక్‌ఇన్ ఇంటర్వ్యూల ద్వారా నిర్వహించనుండగా, తుది మెరిట్ జాబితాను జనవరి 28న విడుదల చేసి, ఎంపికైన వారు ఫిబ్రవరి 1న విధుల్లో చేరాల్సి ఉంటుందని అధికారులు ఆ ప్రకటనలో తెలియజేశారు.

రేపటి నుంచి తిరుచానూరులో 'స్వచ్ఛరథం'

పొడి చెత్తకు నిత్యావసరాలు మార్పిడి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరు గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటి నుంచి పొడి చెత్త సేకరణ కోసం స్వచ్ఛరథం కార్యక్రమాన్ని రేపటి నుంచి ప్రారంభించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ, తిరుచానూరు ఇంచార్జి ఈఓ పిఎన్. మణి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి వద్ద నుంచి ప్లాస్టిక్, ఇనుప, అల్యూమినియం, గాజు, పాత పుస్తకాలు, పేపర్లు, పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి పొడి చెత్తను సేకరించి, వాటికి తగిన విలువ గల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించనున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను వేరు చేసి అందించే అలవాటు ప్రజల్లో పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛరథం జనవరి 3 నుంచి 12 వరకు తిరుచానూరు, యోగిమల్లవరం, చైతన్యపురం, లక్ష్మీనగర్, దామినేడు గ్రామాల పరిధిలోని వివిధ కాలనీలు, వీధుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పర్యటించి చెత్త సేకరణ చేపడుతుందని తెలిపారు. పొడి చెత్తకు బదులుగా కందిపప్పు, ఉద్దిపప్పు, శనగపప్పు, మసాలా దినుసులు, నూనె, బెల్లం, బిస్కెట్లు, సోపులు, షాంపూ ప్యాకెట్లు, నోట్‌బుక్స్, పెన్నులు వంటి నిత్యావసర వస్తువులను అందజేస్తారని తెలిపారు. తిరుచానూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వచ్ఛరథానికి సహకరించి గ్రామ పరిశుభ్రతకు తోడ్పడాలని డిప్యూటీ ఎంపీడీఓ, తిరుచానూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ఈఓ పిఎన్ మణి విజ్ఞప్తి చేశారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకం

పదో తరగతి ఫలితాలపై దృష్టి సారించాలి: కేవీఎన్ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకమని.. పదో తరగతి ఫలితాలపై దృష్టి సారించాలని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన డైరీ, క్యాలెండర్‌ను డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల సాధనతో పాటు విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎస్టీయూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అమలు చేస్తున్న '100 డేస్ యాక్షన్ ప్లాన్' ను విజయవంతం చేయాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో జీఎఫ్ఎల్ఎస్ కార్యక్రమం ద్వారా విద్యా ప్రమాణాలు పెంచడంలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వి.సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా నాణ్యత పెంపునకు తమ సంఘం ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కొండూరు రమేష్ బాబు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మునికృష్ణం నాయుడు, దేవేంద్రుడు, రాష్ట్ర కౌన్సిలర్లు తాళ్ళూరు శ్రీనివాసులు నాయుడు, చిర్రి హరికృష్ణ, జిల్లాలోని వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీవీ నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

పార్టీలకు అతీతంగా తరలివచ్చిన నాయకులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు స్వగృహంలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు గురువారం అత్యంత ఘనంగా జరిగాయి. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ శ్రీకాళహస్తి శాఖ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎస్సీవీ నాయుడు ఆవిష్కరించారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు నారాయణ యాదవ్, సర్పంచ్ బాలాజీ నాయుడు ఆధ్వర్యంలో ఎస్సీవీ నాయుడును, ఎస్సీవీ దిలీప్‌ను భారీ గజమాలతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ... కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు చెందిన పలువురు కూటమి నాయకులు, స్థానిక టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నూతన ఏడాది సందర్భంగా శ్రీకాళహస్తి క్షేత్రం ప్రముఖుల రాకతో సందడిగా మారింది. గురువారం దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి.బాపిరెడ్డి, అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. గవర్నర్ దంపతులు ఆలయంలో రాహు-కేతు పూజలు నిర్వహించి, అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు విద్యాసాగర్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రోటోకాల్ ఏఈవో మోహన్, స్థానిక కోర్టు జడ్జిలు శ్రీనివాస నాయక్, కృష?ప్రియ ఆమెకు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ మర్యాదల ప్రకారం తీర్థప్రసాదాలు అందజేశారు. గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా విచ్చేసి శివయ్యను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి అంతరాలయ దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. ప్రముఖుల పర్యటనల నేపథ్యంలో ఆలయ అధికారులు, పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రహదారి భద్రతానియమాలను వాహనదారులు ప్రతి ఒక్కరూ పాటించాలని మోటారు వాహన తనిఖీ అ్యధికారి దామోదర్‌నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ కార్యాలయంలో గురువారం రహదారి భద్రత మాసోత్సవాలు 2026ను మోటార్ వాహన తనిఖీ అధికారి బి దామోదర నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాసోత్సవాలు జనవరి 1 నుండి జనవరి 31 వరకు జరుగుతుందన్నారు. ముఖ్యంగా రహదారి భద్రత గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారి ప్రమాదాలను తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమము 'శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన' అనే నేపథ్యంతో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. 2024వ సంవత్సరంతో పోలిస్తే 2025 లో ప్రమాదాలు శ్రీకాళహస్తి పరిధిలో పెరిగాయని తెలిపారు. ఇందుకు ముఖ్య కారణం మనకు గత సంవత్సరం నుండి ఆరు వరు సల రహదారి అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రహదారిలో శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు అలాగే సమీప గ్రామస్తులు ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. ముఖ్యంగా హైవేపై వెళ్ళినప్పుడు ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అలాగే కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలి. మన వద్ద జరిగిన ప్రమాదాల్లో సుమారు 40 శాతం కేవలం ద్విచక్ర వాహనాల వల్ల జరిగాయి వీరిలో హెల్మెట్ ధరించి ఉంటే చాలా వరకు మరణాలు నివారించగలిగే అవకాశం ఉండేది. వాహనదారులందరూ తప్పనిసరిగా రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ ఈ సంవత్సరం ప్రమాద రహితంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

తడలో ఆటోల అరాచకం.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-తడ: తడ, తడ కండ్రిగ పట్టణంలో ఆటో డ్రైవర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారిపై ఆటోల వల్ల నిత్యం ట్రాఫిక్ నరకం కనిపిస్తోంది.ఆటో వాలాలు నిబంధనలు గాలికి.. పరిమితికి మించి లోడు సాధారణంగా ఆటోలో నలుగురు లేదా ఐదుగురు కూర్చోవాలి. కానీ, ఇక్కడ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. ఒక్కో ఆటోలో 10 నుండి 15 మందిని గొర్రెల మందలా ఎక్కించుకుంటున్నారు. అధిక లోడుతో జాతీయ రహదారిపై ప్రయాణించడం వల్ల ఏ చిన్న ప్రమాదం జరిగినా భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.జాతీయ రహదారిపై 'మృత్యు' వేగంజాతీయ రహదారి ఎన్ హెచ్ పై భారీ వాహనాలు వేగంగా వెళ్తుంటాయి, వాటికి పోటీగా ఆటో డ్రైవర్లు అతివేగంగా, అడ్డదిడ్డంగా ఆటోలను నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. మలుపుల వద్ద కనీసం సిగ్నల్స్ ఇవ్వకుండా ఆకస్మాత్తుగా ఆపడం వల్ల వెనుక వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.తడ బస్టాండ్ మరియు ప్రధాన కూడళ్లలో ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. దీనివల్ల ఆర్టీసీ బస్సులు ,పారిశ్రామిక వాడలకు కార్మికులను తరలించే బస్సులు లోపలికి రావడానికి, బయటకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. "బస్టాండు కూడళ్లలో అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపినా పట్టించుకోని స్థానిక అధికారులు" అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటోల కారణంగానే తడలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ అంతరాయం: ఆటోలు జాతీయ రహదారి రోడ్డుకు ఇరువైపులా నిలపడం వల్ల పాదచారులు నడవడానికి కూడా చోటు లేని పరిస్థితి ప్రతి నిత్యం చోటుచేసుకుంటోంది . అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా జరిమానాలు విధించడంలో అధికారులు వెనుకాడుతున్నారు.ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాల ముప్పు ఏర్పడుతోందనీ స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.తడలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే తక్షణమే పోలీసులు, రవాణా శాఖ అధికారులు స్పందించాలనీ అడ్డదిడ్డంగా ఆటోలు నిడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వైభవంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-పూతలపట్టు: కాణిపాకం వినాయక స్వామి వారిని ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా దర్శించుకున్న స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, స్వామివారిని దర్శించుకున్నారు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, తరువాత క్యూలైన్లోని భక్తులకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు, బాదం పాలను, బిస్కెట్ ప్యాకెట్లు దేవస్థానం తరుపున అందజేయడానికి ప్రారంభించిన స్థానిక శాసనసభ్యులు, తరువాత కాణిపాకం పోలీసు వారు ఏర్పాటు చేసిన చిన్న పిల్లలు తప్పిపోకున్న జియో టాకింగ్ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పెరుమాళ్ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణవేణి, శివప్రసాద్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపరింటెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బైరెడ్డిపల్లి నాయకులు

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పలమనేరు నియోజకవర్గం శాసనసభ్యులు ఎన్ అమర్నాథ్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి కేక్ కట్ చేసి ఘనంగా నూతన సంవత్సరాన్ని జరపడం జరిగినది. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్ గౌడ్, నాయకులు రఘుచంద్రగుప్త, రమేష్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి నాగరాజు నాయుడు భువనచంద్ర గౌడ్ అరుణ్ గౌడ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బియ్యపు మధుకు బీసీ సంఘం శుభాకాంక్షలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి తన అనుచరులతో కలిసి మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీ ప్రసాద్ రెడ్డి ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గ ప్రజల పక్షాన నిలబడే నాయకుడిగా మధుసూదన్ రెడ్డి సేవలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన బైరెడ్డి జై కుమార్

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల మాజీ సర్పంచ్, మాజీ తెలుగుదేశం మండల అధ్యక్షులు, బైరెడ్డి జై కుమార్ పలమనేరు నియోజకవర్గం శాసనసభ్యులు ఎన్ అమర్నాథ్ రెడ్డిని వారి స్వగృహంలో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దుశ్శాలువా పూలమాల వేసి కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకోవడం జరిగినది. వీరితోపాటు మండల తెలుగుదేశం నాయకులు బైరెడ్డి సాయి ప్రతాపరెడ్డి, ఇల్లూరు బాబు రెడ్డి,బిసి సెల్ నాయకులు గౌరప్ప, ఆర్ఎం రాజీవ్, హరీష్, హర్షవర్ధన్, శివకుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన విద్యార్థి మృతి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ప్లస్వన్ చదివే సోము(16) అనే విద్యార్థి అకాల మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు తాలూకా కేశవరాజుకుప్పం గ్రామానికి చెందిన 20 మంది యువకులు కొత్త ఏడాదిని నారాయణవనం మండలంలోని కైలాసకోన జలపాతంలో జరుపుకోవడానికి గురువారం ఉదయం మోటరైసైకిళ్లపై వచ్చారు. అందరూ సాయంత్రం 4గంటలకు గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఇందులో మనోహరం, తులసీరాం. సోము ముగ్గురూ ఒక బైక్పై బయలుదేరారు. పరమేశ్వరమంగళం గ్రామం వద్ద బైక్ షడన్ బ్రేక్ వేయడంతో వెనక కూర్చొన్న సోము ఎగిరి కిందపడ్డాడు. అదే సమయంలో ఎదురుగా నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు అతనిపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సోము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రి బాయి పూలే పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి: ఆధ్వర్యంలో 3 జనవరి 2026న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కూడలిలో సావిత్రి బాయి పూలే విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆమె జీవితం గురించి బిసి సంఘర్షణ సమితి 3 వేలు పాకెట్ సైజ్ పుస్తకాలు ప్రచురించింది. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఈ పుస్తకాన్ని తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశ తొలి మహిళాఉపాధ్యాయు రాలు, కవయిత్రి, సంఘసంస్కర్త సావిత్రిబాయి విగ్రహం విద్యా కేంద్రమైన తిరుపతి నగరంలో నెలకొల్పడం సంతోషమని ఆమె జీవితం విద్యార్థి లోకానికి స్ఫూర్తి దాయకం అన్నారు. కార్యక్రమంలో బి సి సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిసాకం ప్రభాకర్, కమిటీ సభ్యుడు బివి కేశవులు పుస్తకం రూపకర్తలు డా. సాకం నాగరాజ, డా. డి. మస్తానమ్మ పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్కు అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డా. ఎన్.విశ్వనాథ రెడ్డి నేతృత్వంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పుస్మా నాయకులు డా. టి.వెంకటేశ్వరులు, బి.రవీంద్ర రెడ్డి, ఎస్.ఎం.బాషా, ఆర్.శ్రీధర్ రెడ్డి, టి.రామకృష్ణ రెడ్డి, ప్రసాద్, రఘు నారాయణరావు మర్యాదపూర్వకంగా జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాల అభివృద్ధికి విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలను వారు ప్రశంసిస్తూ, విద్యారంగ ప్రగతికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర-పలమనేరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారితో పట్టణంలోని టిడిపి కార్యాలయ పరిసరాలు గురువారం కిట కిటలాడాయి. నియోజక వర్గం టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, అధికారులు, అనధికారులు, కార్యకర్తలు టీడీపీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యేకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ విచ్చేసిన ప్రతి ఒక్కరికీ మరియు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తో పాటు ధన్యవాదాలు తెలిపారు.

బంగారు చీరలో శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవి

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానం నందు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ చెన్నాలమ్మ పరమేశ్వరి అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ప్రసూనలక్ష్మి ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వేద పండితులచే శాలవా పూలమాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాల అందజేశారు. ఆలయ ప్రాంగణం నందు రకరకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ దీపాలతో దేవాలయ ప్రాంగణం కాంతులు వెదజల్లేలా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిషనర్ ప్రత్యేక ఏర్పాటులు చేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తునే ఏర్పాటు చేశారు. మహిళలు అత్యధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తలకోన సిద్ధేశ్వరుని సేవలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పెద్దిరెడ్డితో కలసి దర్శించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

విశాలాంధ్ర-యర్రావారిపాలెం: తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు దర్శించుకున్నారు. ప్రతి ఏటా కొత్త సంవత్సరం రోజున పెద్దిరెడ్డి, చెవిరెడ్డి కుటుంబీకులు కలసికట్టుగా తలకోన వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్లడం ఆనవాయితీ. ఆ మేరకు గురువారం ఉదయం 5.30 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి 6.30 గంటలకు తలకోన చేరుకున్నారు. భారీ కాన్వాయ్‌తో పెద్దిరెడ్డి, చెవిరెడ్డి కుటుంబీకులతో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకోగానే వేద పండితులు పూర?కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న తరువాత ఆలయ ఈఓ రవీంద్రరాజు శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేయగా వేద పండితులు వేద ఆశీస్సులు అందించారు. అనంతరం ఆలయ అన్నదాన కేంద్రంలో స్థానికులు ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన పెద్దిరెడ్డి, మోహిత్‌రెడ్డిలు అందరితో ఆత్మీయంగా మాట్లాడుతూ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. నేతల నుంచి అపూర్వ స్వాగతంతిరుపతి నుంచి తలకోనకు బయలుదేరిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలకు దారి పొడవునా ఘన స్వాగతం పలికారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ సహదేవరెడ్డి, ఎర్రావారిపాళెం మండల పార్టీ సీనియర్ నాయకులు చెంగల్‌రెడ్డిలు తిరుపతి నుంచి వారి వెంట రాగా భాకరాపేట సర్పంచ్ సాకిరి భూపాల్, మండల పార్టీ అధ్యక్షులు సింహాల మోహన్‌తో పాటు పలువురు పార్టీ సీనియర్లు సాదర స్వాగతం పలికారు. బాణా సంచా పేల్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎర్రావారిపాళెం, నెరబైలు ప్రాంతాల్లో కూడా పలువురు పార్టీ నాయకులు కాన్వయ్‌ను ఆపి పెద్దిరెడ్డి, మోహిత్ రెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆలయం వద్దకు భారీగా చేరుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ శాలువలు, బొకేలతో వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

తానంకి నానాజీ స్వగృహంలో నూతనసంవత్సరం వేడుకలు

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు తానంకి నానాజీ స్వగృహంలో నూతనసంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. రెవిన్యూ సర్వేయర్ మల్లికార్జున రావు, సిబ్బంది, కమ్మవారిపాళెం నాయుడు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి శుభాకాంక్షల ఫ్లెక్సీ చించివేత

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రాజు కుప్పం, వెంకట్ పెరిమాల్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనసేన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీని, బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం కలకలం రేపింది.నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఈ విధమైన దుశ్చర్య జరగడంతో జనసేన, తెలుగుదేశం పార్టీ నేతలు అయోమయంలో పడ్డారు. ప్రజల మధ్య అపార్థాలు సృష్టించే ప్రయత్నంగా ఈ ఘటనను వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ఇలాంటి చర్యలు తగవని, ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు.

మండల నాయకులతో తానంకి

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు మండల నాయకులు గురువారం గూడూరు నియోజకవర్గ ముఖ్య నాయకుడు తానంకి నానాజీ ఇంట సందడి చేసారు. గూడూరు ఏయంసి సారధి చిల్లకూరు పట్టాభి రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, చిరంజీవి, డైరెక్టర్ లు జాకీర్, సుప్రజ, బల్లవోలు దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి, తిక్కవరం సర్పంచ్ ఓడూరు సత్యనారాయణ రెడ్డి, ఓడూరు కీరవాణి (ఎస్సీ సెల్ నాయకులు), యశ్వంత్, పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, పునపరవారిపాళెం అన్నంగి లీలాకుమార్ యాదవ్, సీనియర్ నేతలు మూగ శంకరయ్య, మేగనూరు వెంకట క్రిష్ణయ్య, బూదనం సాగునీటి సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆడిటర్, వ్యాపారవేత్త సూరానేని రామచంద్రరావు, పెనుబోలు జానకి రామిరెడ్డి, చిల్లకూరు మాజీ సర్పంచ్ రామమూర్తి తదితరులు నూతన సంవత్సరం వేడుకలలో పాల్గొన్నారు.

గంజి మాధవయ్యకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పుత్తూరు: ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన అభిమానులు

విద్యుత్ శాఖ ఎఇ సిబ్బంది బొకేలతో వేడుకలు

విశాలాంధ్ర-చిల్లకూరు: నూతన సంవత్సరం సందర్భంగా గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం ముఖ్య నాయకులు తానంకి నానాజీ ఇంటిలో పండగ వాతావరణం నెలకొంది. విద్యుత్ శాఖ ఎఇ బొనిగర్ల శేషాద్రి సిబ్బందితో కలసి శాలువా, పూల బొకేతో నానాజీని ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం వల్లిపేడు నాయకుడు ముఛకేల నందకుమార్ తానంకి నానాజీ ని మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీ స్వామి వారి దేవస్థానం సన్నిధిలో చిత్తూరు శాసనసభ్యులు

విశాలాంధ్ర-పూతలపట్టు: వినాయక స్వామి వారిని దర్శించుకున్న చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురుజాల జగన్మోహన్, కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ.వో పెంచల కిషోర్. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సూపర్డెంట్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

సిఐఎస్ చర్చ్ పాస్టర్ శ్యాం ప్రసాద్

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం తవణం పల్లి మండలం, జనవరి 2026నూతన సంవత్సరం తవణంపల్లి మండలంలో అంబరానంటిన నూతన సంవత్సర సంబరాలు తవలంపల్లి మండలం యుగుమత్యం గ్రామంలో 2026 నూతన సంబరాలు అంగరంగ వైభముగా సి ఎస్ ఐ చర్చిలో పాస్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విద్యుత్ దీపాలు సాంస్కృతిక భజన దీప ఆరాధన జరిగింది. 2026 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం3 గంటల వరకు పాత సంవత్సరం 2025 ు 2026 కొత్త సంవత్సరం దేవుని సందేశమును భక్తులకు వివరించారు. సంవత్సర చర్చి అధికారులను గౌరవించి కొత్తవారిని నియమించి అభిషేకించారు. ఈ సందర్భంగా ఆటలు పాటలు వ్యాసరచన పోటీలు పూర్వకాల సాంప్రదాయ ఆటలు పాటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజే శారు. పేదవారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాల సంబరాలు పాత సంవత్సరం గతించినది నూతన సంబరాలు లో మంచి కార్యక్రమాలు జరగాలని ప్రజలు సుఖసంతోషాలు ఆరోగ్యా లతో మెండుగా జీవించాలని క్రైస్తవ భక్తులకు వివరించారు. ఇదే కాకుండా మండలంలోని వీర్ల గుడిపల్లి దిగుమత్యం, ముత్తుకూరు, అరగొండ, గాజులపల్లి, తోడతర, చెర్లోపల్లి, స్వస్తిక్ నగర్, మాధవరం పత్రపల్లి, చారాల, ఎన్టీఆర్ కాలనీ, మడవనేరి, ఈచినేరి, కొండరాజు కాలువ, తడకర, తవణంపల్లి, ఐరాల క్రాస్, దిగు మారేడుపల్లి ఏగుమారేడ్పల్లి, పుణ్య సముద్రం, తదితర చర్చిలలో నూతన సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అరగొండ, తవనంపల్లి మండలం, అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, కార్యదర్శి లూయిస్, కోశాధికారి రామ్మూర్తి, ఉపాదేశకులు సంతోష్, రమేష్ ,జ్ఞాన ప్రకాష్, టీ ప్రకాష్, పాల్ దొరస్వామి, అన్ని సంఘ ఉపదేశకులు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
సబ్-ఎడిటర్స్ కావలెను
తిరుపతి ఎడిషన్ ఆఫీసులో పనిచేయుటకు సబ్-ఎడిటర్స్ కావలెను.
తెలుగు భాషపై పట్టు, వార్తలు, సామాజిక, రాజకీయ అంశాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
విద్యార్హతలు
డిగ్రీ పాసైయుండి తెలుగు టైపింగ్, ఫొటో షాప్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీలు పెట్టగలిగి ఉండాలి.
గమనిక: అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
ఎడిషన్ మేనేజర్
అడ్రస్: విశాలాంధ్ర ఎడిషన్ కార్యాలయం, డోర్ నెం.9-91/5, ఇందిరమ్మ గృహాలు ఎదురుగా దామినేడు, తిరుపతి రూరల్. సెల్: 9490952129

మదనపల్లిని జిల్లాగా ప్రకటించాలి.సిపిఐ డిమాండ్

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర-మదనపల్లి:మదనపల్లి జిల్లాగా ప్రకటించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కృష్ణప్ప,సాంబ శివ, మురళి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మదనపల్లి ప్రజల ఆకాంక్ష మదనపల్లి జిల్లా అని, మదనపల్లిని జిల్లాగా చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి,నేడు మాట తప్పుతున్నారని అన్నారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన మదనపల్లిని జిల్లాగా ప్రకటించకపోగా,గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తూ, జిల్లా కేంద్రంగా మదనపలను మార్చారన్నారు. భవిష్యత్తులో మదనపల్లి జిల్లా కేంద్రం ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయం పరిస్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. పాలకుల రాజకీయ ప్రయోజనాల కోసం మదనపల్లి 1920 సంవత్సరం నుండి నేటి వరకు దగా పడుతూనే ఉందని అన్నారు. రేపు ప్రభుత్వం మారితే మదనపల్లి జిల్లా కేంద్రంగా ఉంటాదని గ్యారెంటీ కూడా లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అటు అన్నమయ్య చరిత్రను,ఇటు మదనపల్లి చరిత్రను రెండింటిని అవమానిస్తూ రెండు ప్రాంతాలకు సమన్యాయం చేస్తుందన్నారు. మదనపల్లి ప్రజల ఆకాంక్ష మదనపల్లి జిల్లా అని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని,మదనపల్లిని జిల్లా కేంద్రంగా మదనపల్లి పేరుతో జిల్లాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి మదనపల్లి జిల్లాగా ప్రకటించకపోతే ఈ ప్రాంతంలో ప్రజాపోరాటం ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, అంజి,వెంకటరమణ, గజపతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ హ్యాకథాన్-2025లో ప్రతిభ చూపిన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-మదనపల్లి:మిట్స్ యూని వర్సిటీ విద్యార్థులు చెన్నై కి చెందిన జెనోవెక్స్ టెక్నాలజీస్ నిర్వహించిన ప్రతిష్టాత్మక ఎక్స్ హ్యాకథాన్-2025 కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీలో ఇంజనీరింగ్ సి.ఎస్.ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న మోహన్ కృష్ణ వర్ధన్ కుమార్, శణ్ముఖ సాయి, మోహిత్‌లు, విష్ణువర్ధన్ సి.ఎస్.ఈ (నెట్‌వర్క్స్)తో కూడిన బృందం తమ వినూత్న ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం, సమన్వయంతో పోటీలో అదుతేమైన ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ బహుమతి గా రూ.10,000 నగదు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను యూని వర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్.విజయ భాస్కర్ చౌదరి, ఛాన్సలర్ యెన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ,అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు టీవీ, వాటర్ డిస్పెన్సర్, వాటర్ డ్రమ్ వితరణ

విశాలాంధ్ర-మదనపల్లి: చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆనంద వృద్ధాశ్రమానికి అలాగే వసతి గృహానికి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారు ఉపయోగకరమైన 1000 లీటర్ల నీటి డ్రమ్మును, టీవీ, ఒక వాటర్ డిస్పెన్సర్ను, అందించారు. ఈ కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. కృష్ణచరణ్ అధ్యక్షతన సంస్థకు ఈక్విటస్ సంస్థ మేనేజర్ అయినటువంటి సురేష్‌కి సంస్థతో ఉన్న అనుబంధాన్ని, ఆయన పూర్వం చేసినటువంటి సేవలను గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ఎమ్. పి.ఆనందన్, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేద్దాం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: కొత్త ఏడాది ప్రారంభం నుంచి సమాజంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దామని తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిద్దారెడ్డి అన్నారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి శంకర్ మాట్లాడుతూ కొత్త ఏడాదిలో పింఛనర్ల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. విశ్రాంత ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సంఘానికి సొంత భవనం సమకూరేలా చర్యలు చేపడుతామన్నారు. అంతకు మునుపు స్థానిక ఎస్టీవో నరేష్కు 30 మంది విశ్రాంత ఉద్యోగులు మూకుమ్మడిగా వెళ్లి జీవన ప్రమాణ ప్రతాలను అందజేశారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరయ్య, బీవీ.రమణ, మస్తాన్వలి, నారాయణ, సారధి, శ్రీరాములు, నాగరాజు, రెడ్డెప్ప, తాలూకా విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

65 మంది రక్తదానం

విశాలాంధ్ర-మదనపల్లి: ఆంగ్ల సంవత్సరాది సందర్భనవరి ఒకటవ తేదీన "వెల్ విషర్స్" అండ్"ఫ్రెండ్స్ టూ సపోర్ట్" సంస్థల ఆధ్వర్యంలో మదనపల్లె ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు. ఈ సారి క్యాంప్‌లో కొత్త వాళ్ళు ఎక్కువ మంది రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయం. విజయ్ భాస్కర్, హేమంత్, భాను ప్రకాష్, రామకృష్ణ, హరిబాబు,అస్రర్, ఇలా కొంతమంది వారి మిత్రులని ప్రేరేపించి రక్తదానం చేయించారు. ప్రతి ఒక రక్తదాత కి ఒక తిరుపతి లడ్డు కానుకగా అందజేశాం. దీని కోసం ఎక్కువ సంఖ్యలో లడ్డులు శంకర్ ప్రసాద్ సేకరించారు. వాలంటీర్ లు (వంశీ, రెడ్డి శేషు, భాను, లక్ష్మీపతి, అరుణ్ తదితరులు) పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-వాల్మీకిపురం:పట్టణ శివారు ప్రాంతంలోని వీరభద్రగిరి సమీపంలో వెలసిన శ్రీ షిర్డిసాయినాథుడి ఆలయంలో గురువారం ఘనంగా ఆంగ్ల సంవత్సర వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా సాయినాథుడికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అర్చకులు ప్రత్యేక హారతులు ఇచ్చారు ఆలయప్రాంగణంలోని గార్డెన్లో విదేశీ పుష్పాలంకరణ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భజనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలతో పాటు సాయి నాథుడిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రత్యేకపు "జలు నిర్వహించారు. అలాగే తితిదే ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరామాలయంలో సైతం' భక్తులు పోటెత్తారు. ఆంగ్ల సంవత్సరాధి సందర్భంగా సీతారాములకు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్థానిక తెదేపా, వైకాపా, జనసేన, భాజపా నాయకులు కేకులు కోసి పంచిపెట్టుకుని నూతనసంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలో చేర్చండి

విశాలాంధ్ర-వేంపల్లి: బ్రాహ్మణ సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ప్రస్తుతం వున్న బీసీ కార్పొరేషన్ నుండి దేవాదాయ శాఖ పరిధి లోకి తేవాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పీవీయెస్ వి ప్రసాదరావు ఒక ప్రకటన లో కోరారు. 2014లో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పుడు దేవాదాయ శాఖ పరిధి లో ఉండినదని 2019వరకు కార్పొరేషన్ పథకాలు ఇబ్బంది లేకుండ జరిగాయని అన్నారు. ఆ సమయంలో లక్ష మందికి పైగా బ్రాహ్మణ లు లబ్ది పొందారని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారినప్పుడు దేవాదాయ శాఖ నుండి బీసీ కార్పొరేషన్ లో కలిపినారని అప్పటి నుండి బ్రాహ్మణ సంక్షేమం మందకొడి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చంద్రబాబు నేడు తిరిగి సీఎంగా వున్నారు కాబట్టి తిరిగి దేవాదాయ శాఖ పరిధి లోకి తెచ్చే ప్రయత్నం చేయాలని అది ఇప్పటి కార్పొరేషన్ నాయకులు పై ఉందని అన్నారు. బీసీ కార్పొరేషన్ నుండీ బయటకు తీసుకొని రాకపోతే బ్రాహ్మణ లకు ఎటువంటి మేలు జరగదని అన్నారు. కార్పొరేషన్ పాలకమండలి ఏర్పడి 3నెలలు అవుతున్న ఇంతవరకు ఒక్క పథకం అమలు కాలేదని గుర్తు చేశారు. కనీసం గరుడ పథకం ప్రారంభం చేయాలనీ కోరుతున్న ఎక్కడ ఆగి పోయిందో తెలవడం లేదని అన్నారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ కార్యాలయం లో పెండింగ్ పడినట్లు అనుకొంటున్నారని అదే నిజమైతే ఈ సంవత్సర%శీ% కూడా బ్రాహ్మణ లకు ఏ పథకం రాదేమో అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్న బ్రాహ్మణ కుటుంబాలను దృష్టి లో ఉంచుకొని పాలక మండలి సభ్యులు కార్పొరేషన్ పని తీరును మెరుగు పరచాల్సిన బాధ్యత తీసుకోవాలని కార్పొరేషన్ దేవాదాయ శాఖ పరిధి లోకి తెచ్చేటట్లు ప్రభుత్వం దగ్గర కృషి చేయాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లిలో గురువారం కాంగ్రెస్ నాయకులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు వేంపల్లికు వచ్చి రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరం అనేక చేదు జ్ఞాపకాలతో కాలగర్భంలో కలిసిపోయిందన్నారు. కనీసం 2026వ నూతన సంవత్సరంలోనైనా జిల్లాకు రాష్ట్రానికి,దేశానికి మంచి జరగాలని ఆకాంక్షించారు.కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ దుగరాజపట్నంలో ఓడరేవు నిర్మాణం కాలేదన్నారు. ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీ అయిందని, 6900 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు చెల్లించ లేదన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, పొద్దుటూరుకి చెందిన కాంగ్రెస్ నాయకులు పూల నజీర్, ప్రముఖ సంఘ సేవకులు సలా ఉద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరీ జయరాంరెడ్డి గంగులయ్య అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ బుల్లెట్ రాజా తదితరులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు షబ్బీర్, వేముల మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఓబయ్య తదితరులు తులసి రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉల్లిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో న్యూఇయర్ సందడి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో గురువారం న్యూఇయర్ సందడి కనిపించింది. ఈ వేడుకలను పురస్కరించుకుని పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాజా కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నా పేరు ఎల్లమ్మ, ఓ పిల్లగా వెంకటేశా, మీసాల పిల్ల, రాను బొంబాయికి మొదలగు పాటలకు చిన్నారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు, ప్రేక్షకులు చిన్నారులను కరతాల ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు, కార్యక్రమంలో సూపర్వైజర్ వరప్రసాద్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే,డీఈఓలను కలిసిన పోర్డ్ సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ

విశాలాంధ్ర-మదనపల్లె : హైస్కూల్ విద్యార్థుల్లో శాస్త్రపరిశోధనల్లో స్టెమ్ ల్యాబ్ చాలా బాగా ఉపయోగపడుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.2026 నూతన ఏడాదిని పురస్కరించుకొని మదనపల్లిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కలుసుకున్నారు.అలాగే పూల మొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఈవో స్పందిస్తూ ఫోర్డ్ సంస్థ సేవలను అభినందించారు.బడి బయట పిల్లలను,బాల కార్మికులను గుర్తించి వారిని చదువుకునేలా ప్రోత్సహిస్తూ పంపించడాన్ని గట్టిగా సమర్ధించారు.మదనపల్లి ఎమ్మెల్యే శాసన సభ్యులు షాజహాన్ బాషాను కలిసి పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అలాగే కొత్త సంవత్సరం మొదటి రోజు నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి నుంచి జిల్లా యంత్రాంగం కొలువుదీరి కార్యక్రమాలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కొత్త ఏడాదిలో మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు.

మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు జింకా సుబ్రహ్మణ్యంకు ఆహ్వానం



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఈ నెల 3, 4, 5వ తేదీలలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యంకు ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో శ్రీ సత్య సాయి స్పిరిచుయల్ సిటీ క్షేత్రంలో పెద్ద ఎత్తున 3 రోజుల పాటు జరిగే ఈ తెలుగు మహాసభలలో పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర మంత్రులు ఆరు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సభాపతి అయ్యన్న పాత్రుడుతో పాటు తెలుగు ప్రముఖులు, 50 దేశాల సాహిత్య సంఘాల ప్రతినిధులు, ప్రముఖ సినీ నటులతో పాటు సాహితీవేత్తలు, మరెందరో ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సభలో జాషువా, కరుణ శ్రీ కవి సమ్మేళ వేదికలో తనకు పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలియజేశారు.

వైవియు ఎల్ఎల్‌బి సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-కడప వైవీయూ:యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని లా కళాశాలల ఎల్.ఎల్.బి పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తన చాంబర్లో గురువారం విడుదల చేశారు. ఎల్.ఎల్.బి మూడేళ్ల కోర్సు సంబంధించి 2,4,6 సెమిస్టర్లు, ఐదేళ్ల కోర్స్ కు సంబంధించి 2,4,6,8 సెమిస్టర్ల ఫలితాలను వెల్లడించారు. విద్యార్థులు ఫలితాల కోసం వైవియు వెబ్సైట్ https://www.yvuexams.in/results.aspxను సంప్రదించా లని సూచించారు. అక్టోబర్ మాసంలో జరిగిన ఈ పరీక్షల మూల్యాంకనం ప్రక్రియలో చురుగ్గా వ్యవహరించిన సీఈ కార్యాలయ పరీక్షల సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డా. మల్లెల రవికుమార్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మల్లెల రవి కుమార్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థిగా, అధ్యాపకునిగా పనిచేసిన అనుభవంతో, ప్రభుత్వ సహాయ, సహకారాలతో కళాశాల నాక్, ఎన్.ఐ.ఆర్.ఎఫ్ లో మంచి ర్యాంక్ సాధించడానికి దానితో పాటు, కళాశాల, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ఏఓ రమణ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డా.వెంకటసుబ్బయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రామకృష్ణ, ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డా. నీలయ్య, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవి సురేష్ బాబు,అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా పోరాటాలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఆర్ఎస్ఎఫ్ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలోని భగత్ సింగ్ పార్క్ లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యారంగ సంక్షోభాన్ని ప్రశ్నిస్తూ, నూతన సంవత్సరంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కూటమి సర్కార్ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కరమే ధ్యేయంగా పోరాడే కాలం ఇది అని విద్యార్థులకు ఆర్ఎస్ఎఫ్‌రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన 20 మాసాలలోనే విద్యారంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని ఉందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఫార్మా జేఏసీ చైర్మన్ డాక్టర్ సుమన్, యువ న్యాయవాదులు సూర్యవంశీ యాదవ్, ఆదిత్య రెడ్డి, ఆర్ఎస్ఎఫ్ కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి.వంశీ వి రెడ్డి సాయి ఉపాధ్యక్షులు టోనీ, క్రాంతి కుమార్, బాల సుందరం జిల్లా నాయకులు సాయి, జగదీష్, కిషోర్,ప్రకాష్ పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం అధ్యక్షుడిగా బండారు సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తొగటవీర క్షత్రియ కళ్యాణ మండప నూతన అధ్యక్షుడుగా బండారు సూర్య నారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కృషి చేస్తానని, దాతల పేర్లతో శిలాఫలకాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అలాగే మినీ కళ్యాణ మండపం ఏర్పాటుతో పాటు, మెడికల్ క్యాంప్, కళ్యాణమండపం తరపున సభ్యులకు జీవితా భీమాను చేస్తామన్నారు. అలాగే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తొగటవీర క్షత్రియుల సంక్షేమానికి కృషి, పేద ప్రతిభ గల తొగట విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని తెలిపారు. కార్తీక వనభోజనాలు తదితర సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడుతామన్నారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. కళ్యాణ మండపం అధ్యక్షునితో పాటు వ్యవస్థాపక అధ్యక్షుడు బండారు రఘురామయ్యలతో డాక్టర్ కల్లె పెద్ద వెంకట రంగయ్య, పట్నం గొవిందప్పలు ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకవర్గ సభ్యులుగా మోతుకూరి వెంకట రమణ, చిన్నకోట్ల నాగభూషణం, పల్లా వెంకట సుబ్బయ్య, గంజికుట ఆంజనేయులు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, చౌడం ప్రసాద్, కుందా నాగరాజుతో పాటు 40 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వాకారం చేశారు. బండారు సూర్య నారాయణ, రఘురామయ్యలతో నూతన కమిటీని పలువురు తొగటవీర క్షత్రియ ప్రయుఖుల, బీసీ నేతలు, పుర ప్రముఖులు శాలువ కప్పి పూలమాల వేసి అభినందించారు.

వేముల మండలంలో వైసిపి షాక్

విశాలాంధ్ర-పులివెందుల: వేముల మండలంలో వైసిపికి బిగ్ షాక్ తగిలింది. మండలంలోని బెస్తవారిపల్లెకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో వల్లెపు శ్రీనివాసులు,వల్లెపు వెంకట రమణ,పందిపోటు వెంకటేష్,గోగుల ప్రసాదు,గోగుల పద్మావతి, రాగిరి గీత, రాగిరి నాగేంద్ర, వల్లూరు వీరాంజి,వల్లూరు మహేశ్వరి లు వైసీపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం పులివెందుల జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డిలు వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న రోజుల్లో మరింత మంది వైసిపి నుంచి టిడిపిలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని వెల్లడించారు.

టిడిపి సీనియర్ నేత వెంకటరామిరెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో గురువారం పట్టణ మాజీ అధ్యక్షులు, సీనియర్ నేత మద్దూరు వెంకటరామిరెడ్డికి ఘన సన్మానం లభించింది. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ శ్రేణులు సారెడ్డి గంగాధర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డిలు వెంకటరామిరెడ్డిని శాలువతో సత్కరించారు. సన్మాన గ్రహిత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో టిడిపి రోజురోజుకు క్రమక్రమండా బలపడుతోందన్నారు. గడచిన సంవత్సరంలో అనుకోకుండా వచ్చిన వరదల నియంత్రణలో సీఎం చంద్రబాబు సమర్థవంతంగా ఎదుర్కొన్నారన్నారు. గత ఏడాది విజయాలు సాధించినట్లే అదే తరహాలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కూడా మరెన్నో విజయాలు సాధిస్తామని ఆశాబావం వ్యక్తంచేశారు.

ఎంపీ మిధున్ రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెద్దమండెం : మండలంలోని కంచర్లపల్లి సాయి జువెలర్స్ అధినేత మధుకర్ ఆచారి నూతన సంవత్సరం సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి అతని నివాసంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి జ్యువెలర్స్ అధినేత మధుకురాచారి కంచర్ల ఉపసర్పంచ్ అమీన్ మరియు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర- పెద్దమండెం : మండలంలో అన్నమయ్య జిల్లా వైసీపి ఆక్టివిటీ సెక్రెటరీ బైన మధుకర్ రెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా తంబాలపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు మండల అధ్యక్షులు వైయస్సార్ సభ్యులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

కలిచర్ల సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెద్దమండెం : మండలంలో వైయస్సార్ సిపి నాయకులు కల్చర్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ కంచల సుధాకర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా ఆక్టివిటీ సెక్రెటరీ బైన మధుకర్ రెడ్డి మరియు సర్పంచులు ఎంపీటీసీలు ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్ మాజీ ఎంపీపీ రమేష్ మరియు గ్రామ ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-పొద్దుటూరు: కమలాపురం షేక్ దస్తు అండ్ సన్స్ 25వ వార్డు టిడిపి ఇన్ చార్జ్ ఖాదర్ వల్లి వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక మార్కెట్ లో ప్రముఖ పండ్ల వ్యాపారి దస్తు అండ్ సన్స్ ఖాదర్ వల్లి ఆధ్వర్యంలో వికలాంగుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరిపారు. అనంతరం తెదేపా పట్టణ ఉపాధ్యక్షులు ఖలీల్ చేతుల మీదుగా వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చలపతి, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్ భాషను కలిసిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషలో మండల టిడిపి నాయ కులు కలిసి పుష్పగుచ్చం అంద జేశారు. శాసనసభలో మదన పల్లి జిల్లా ఏర్పాటు అవసరం పై ఇక్కడి ప్రజల మనోభావాలను అసెంబ్లీలో మాట్లాడటం. జిల్లా కేంద్రం ఏర్పాటులో ఆయన కృషి మరువరానిదని కొనియాడారు. మదనపల్లి జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పడడంపై మండల టిడిపి నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు గూటం ఈశ్వరప్ప, టిడిపి సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి మండల టిడిపి అధ్యక్షు లు ఆనంద రెడ్డి, మెకానిక్ చంద్ర ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

వెల్లు వెత్తిన నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల పట్టణంలో గురువారం కౌన్సిలర్ కోడి రమణ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి నివాసానికి వెళ్లి నూతన సంవత్సరం వేడుకలు జరిపి శుభాకాంక్షలు తెలిపారు.శాలువాల తో సత్కరించి వైయస్ మనో రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ కొత్త వెలుగులు కలగాలని అందరూ బాగుండాలని వైఎస్ మనో రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, మాజీ సివిల్ సప్లైస్ డైరెక్టర్ హాలు గంగాధర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కనకం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అభిమానాన్ని గుండెల్లో దాచుకుంటాం- ఎమ్మెల్యే, చైర్మెన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ప్రజాప్రతినిధుల, పార్టీ నాయకుల కార్యకర్తల అధికారుల అనధికారుల అభిమానాన్ని గుండెల్లో దాచుకుంటామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి, సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి కొనియాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేనపార్టీ నాయకులు తదితరులు ముక్కా వారిపల్లిలోని కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే కి, ఛైర్మెన్ కు, వరలక్ష్మి కి గజమాల వేసి 2026 కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. వెల్లువెత్తిన అభిమానంతో ఎమ్మెల్యే, ఛైర్మెన్ తడిసి ముద్దయ్యారు. నూతన సంవత్సరం సందరరేగా వ్యయ ప్రయాసల కోర్చి సుదూర ప్రాంతాల నుంచి టిడిపి, జనసేనపార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద ఎత్తున విచ్చేసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. వచ్చిన కార్యకర్తలను, నాయకులను, అభిమానులను అదుపు చేయడం సాధ్యం కాలేదు.పేదల పక్షపాతిగా ముద్రపడ్డ ఎమ్మెల్యేకు, ఛైర్మెన్‌కు ఆ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు, అభిమానులకు అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు.నూతన సంవత్సరంలో కలిసికట్టుగా ముందుకు పోదామని పిలుపునిచ్చారు.కేక్ లను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. రాజకీయనాయకుల, అధికారుల నివాసాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

సమిష్టి కృషితో అభివృద్ధికి పాటుపడదాం..

సన్మానాలు.....శుభాకాంక్షలతో నేతలకు అభినందనల వెల్లువ..

టిడిపి, జనసేన, బిజెపి కార్యాలయాల్లో అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు...



విశాలాంధ్ర -రాజంపేట : నూతన సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నిండాలని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు, జనసేన పార్లమెంట్ సమన్వయకర్త ఎల్లటూరి శ్రీనివాసరాజు, బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ ఆకాంక్షించారు.నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తమ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి గజ మాలలు,శాలవాలు పూల బొకేలతో ఘనంగా సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందరరేగా వారు మాట్లాడుతూ సంవత్సరం ఆనందంగా, ఆరోగ్యంగా గడవాలని అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని,సహకారం అవసరమని తెలియజేశారు.ఈ ఏడాది విజయాలతో ప్రతి ఒక్కరి జీవితం గడవాలని అయన ఆకాంక్షించారు. అనంతరం వివిధ మండలాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు భోజనాలను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ నాగేశ్వర్ రాజు, ఉపాధ్యాయులు హరినాథ్, దొరబాబు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ